తవ్వేకొద్దీ అవినీతి..!



గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామ సమీపంలోని మల్లెలవంక ఇది. ఈ గ్రామ సమీపంలో మూడు చెక్ డ్యాంలు నిర్మించినట్లు రూ.29.50 లక్షలకు ఫోర్జరీ సంతకాలతో ఓ కాంట్రాక్టరు రికార్డులు సృష్టించాడు. దీనికి బిల్లులు చెల్లించాలని ఇంజనీర్లు సీఎఫ్ఎంఎస్ ఖాతాలో అప్‌లోడ్ చేశారు.

- వైసీపీ హయాంలో చేయని పనులకు బిల్లులు
- ఇంజనీర్ల సంతకాలు ఫోర్జరీ చేసి ఎం-బుక్, రికార్డులు
- ఎన్నికల కోడ్‌లోనూ అగ్రిమెంట్లు
- పక్కా ప్రణాళికతో అక్రమాలు
- ఇప్పటికే దొంగ బిల్లులతో రూ.4 కోట్లు స్వాహా
- తాజాగా మరో రూ.2 కోట్లకు బిల్లులు

కర్నూలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో సాగునీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాలు పెంచాలనే మహోన్నత లక్ష్యంలో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో నాటి ప్రభుత్వ పెద్దలు, ముఖ్య నాయకుల అండదండలతో కాంట్రాక్టర్లు, వైసీపీతో అంటకాగిన కొందరు ఇంజనీర్లు పనులు చేయకుండానే బోగస్ బిల్లులు పెట్టి ప్రజాధనం స్వాహా చేశారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో నీరు-చెట్టు కింద రూ.1,585 కోట్లకు ఒప్పందం (అగ్రిమెంట్) జరిగితే.. రూ.580.37 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇదే ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోకి వచ్చే చిన్నతరహా నీటిపారుదల (ఎంఐ) కర్నూలు డివిజన్‌లో 370.36 కోట్లకు అగ్రిమెంట్ చేస్తే రూ.177 కోట్లు ఖర్చు చేశారు. నంద్యాల డివిజన్ పరిధిలో 870.95 కోట్లకు అగ్రిమెంట్ చేస్తే రూ.205.31 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. నీరు-చెట్టు కింద మంజూరైనా మొదలు పెట్టని పనులే వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులకు వరంగా మారాయి. వైసీపీ ముఖ్య ప్రజాప్రతినిధుల అండతో ఇద్దరు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా దొంగ బిల్లులు సృష్టించి అందినకాడిని దోచుకున్నారు. మీకు తోడుగా మేమంటూ జిల్లా స్థాయి కీలక ఇంజనీరింగ్ అధికారులు అభయం ఇచ్చారో.. వైసీపీ నేతల ఒత్తిళ్లకు కాంట్రాక్టర్లు చెప్పినట్లు తలొగ్గారో తెలియదు కానీ అవినీతి మాత్రం భారీ ఎత్తున జరిగింది. కాంట్రాక్టర్లు తెచ్చిన దొంగ బిల్లులు దర్జాగా సీఎఫ్ఎంఎస్ ఖాతాలో అప్‌లోడ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

మిగతా 6లో..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలో కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు కుమ్మక్కై నీరు-చెట్టు పేరిట సాగించిన భారీ కుంభకోణమిది. ఎలాంటి పనులు చేయకుండానే క్షేత్రస్థాయి పర్యవేక్షణ, క్వాలిటీ విభాగం ఇంజనీర్లు సంతకాలు ఫోర్జరీ చేసి ఎం-బుక్, ఇతర రికార్డులు సృష్టించి రూ.కోట్లు ప్రజాధనం స్వాహా చేశారు. తవ్వేకొద్దీ అక్రమాలు బహిర్గతం అవుతున్నాయి. 2019 ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న తేదీలతో బోగస్ అగ్రిమెంట్లు సృష్టించారు. ఫోర్జరీ సంతకాలతో రికార్డులు తయారు చేసి ఇప్పటికే 41 పనులకు దాదాపు రూ.4 కోట్లు స్వాహా చేశారు. అంతటితో ఆగకుండా మరో రూ.2 కోట్లకు పైగా దొంగ బిల్లులు పెట్టినట్లు వెలుగులోకి వచ్చింది. 'మా సంతకాలు ఫోర్జరీ చేసి సృష్టించిన దొంగ బిల్లులు అవి. వాటికి ఎలాంటి చెల్లింపులు చేయకండి..' అంటూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో తెలుస్తోంది. ఈ అవినీతి భాగోతంపై నేడు జిల్లా పర్యటకు వస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ సర్వత్రా వ్యక్తమవుతోంది.



జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయం

న్యూస్ బాక్స్

నేడు జిల్లా సమీక్ష సమావేశం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సునయన ఆడిటోరియంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన సమీక్షా సమావేశం జరుగుతుందని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు హాజరవుతారన్నారు. ప్రధానంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు.

నేడు ప్రజా వినతుల స్వీకరణ : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ పి.రంజిత్ భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు ఉదయం 9:30 గంటలకే చేరుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కన్నయ్య నాయుడు



పూజలు చేస్తున్నకన్నయ్య నాయుడు

మంత్రాలయం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని జలాశయాల గేట్ల నిపుణులు, ప్రభుత్వ సలహాదారుడు కన్నయ్య నాయుడు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్ వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట సూపరింటెండెంట్ అనంతపురాణిక్, బిందు మాధవ్, అనంత స్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు ఉన్నారు.

గణేకల్లులో రోడ్డు ప్రమాదం

- రెండు ఆటోలు ఢీ, ఇద్దరు మృతి
- 8 మందికి గాయాలు

7

పశ్చిమ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

నేడు జిల్లా ఇన్‌చార్జి, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రాక

7

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు : వైసీపీ

కిక్కిరిసిన శ్రీగిరి

- భక్తుల రద్దీతో దర్శనమిచ్చిన శ్రీశైలం
- నేడు లక్ష దీపోత్సవం

శ్రీశైలం, నవంబరు 3: శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారం రోజుల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఆలయ ఉత్తర మాడవీధి, గంగాధర మండపం భక్తులు దీపారాధనలను చేశారు. దేవస్థానం అధికారులు క్యూలైన్లలో భక్తులకు మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మొదటి సోమవారం పురస్కరించుకుని సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణీ హారతికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన : ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన రితుపర్ణ కూచిపూడి నాట్యలయం కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకౌత్వం, భో శంభో, శివాష్టకం తదితర శైవగీతాలకు కళాకారులు నృత్యప్రదర్శనతో అలరించారు.



దీపారాధనలు చేస్తున్న మహిళలు



క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు



నృత్యం చేస్తున్న కళాకారులు

యురేనియంపై ప్రజాగ్రహం తప్పదు

- తవ్వకాలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య



యురేనియం తవ్వకాల కోసం గంలో వేసిన బోర్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ, నవంబర్3(ఆంధ్రజ్యోతి): ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తంగా మార్చే యురేనియం తవ్వకాలపై ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని ఎదుర్కోకతప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య అన్నారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర నేతలు మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాల ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియం అనుమతులు తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రిజర్వ్ ఫారెస్టు పరిధిలో 68 యురేనియం బోర్ల తవ్వకాలకు అనుమతి ఇచ్చిందని, పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఈ అనుమతులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. యురేనియం వెలికి తీస్తే ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని, పచ్చని పొలాలు బీళ్లుగా మారిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ ప్రతిపాదనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల దిగ్బంధిస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఈనెల 6వ తేదీన కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటిస్తున్నారని, ఈ సందర్భంగా యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపట్టడానికి శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గిడ్డయ్య, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం, కార్యవర్గ సభ్యుడు రాజాసాహెబ్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం. నరసారావు తదితరులు పాల్గొన్నారు.

మా అమ్మ.. మాకొద్దు..!

- తిరుపతమ్మను తీసుకెళ్లేందుకు నిరాకరించిన బిడ్డలు
- పోలీస్‌స్టేషన్‌లో విచారించిన సీఐ జయన్న



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయన్న



పత్తికొండ ఆసుపత్రిలో దీనావస్థలో ఉన్న వృద్ధురాలు తిరుపతమ్మ

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'నడి రోడ్డుపై అమ్మ' కథనం రాష్ట్ర వ్యాప్తంగా ఆవేదన కలిగించినా ఆమె కొడుకు, కుమార్తెల్లో ఇసుమంతైనా దయ కలగలేదు. తల్లిని తమతో తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ కొడుకు, కుమార్తెలు పోలీసుల ఎదుటే తేల్చి చెప్పారు. కన్నతల్లిని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిన వృద్ధురాలు తిరుపతమ్మ కొడుకుతోపాటు కూతుళ్లకు పత్తికొండ సీఐ జయన్న ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంతకల్లులో ఉన్న కొడుకు శ్రీనివాసులు, ఆయన భార్యతో పాటు బళ్లారిలో ఉంటున్న కుమార్తె, అల్లుడు, పత్తికొండలో ఉంటున్న మరో కుమార్తె, అల్లుడు ఆదివారం రాత్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆసుపత్రిలో దయనీయ స్థితిలో ఉన్న తల్లిని తీసుకెళ్లాలని సీఐ వారికి సూచించారు. అయితే తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తాము తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ వారు స్పష్టం చేశారు. సీఐ ఎంత నచ్చచెప్పినా వారు వినలేదు. అయినప్పటికీ వారికి సోమవారం గడువు ఇస్తున్నామని, లేదంటే చట్టప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

వలసెళ్లిపోయిన కోసిగి



కర్నాటక రాష్ట్రానికి బొలేరో వాహనాల్లో వలస వెళ్తున్న కోసిగి కూలీలు

- ఒకే రోజు 500 కుటుంబాలు కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు
- సుమారు వంద మంది దాకా బడిపిల్లలు తల్లిదండ్రుల వెంటే



3వ వార్డు నుంచి తల్లిదండ్రులతో పాటు వలస వెళ్తున్న విద్యార్థులు

కోసిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం మొత్తం వలసెళ్లిపోయింది. మండలంలోని 26 గ్రామాల్లో రైతులు, కూలీలు వలస(సుగ్గి)బాట పట్టారు. స్థానికంగా పనులు లేకపోవడంతో చేసేదేమీ లేక మూటాముల్లె సర్దుకుని పిల్లాపాపలతో తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లిపోయారు. ఆదివారం ఒక్కరోజే కోసిగి మండలం నుంచి సుమారు 500 కుటుంబాలు 20 పైగా ప్రైవేటు వాహనాల్లో వలస బాట పట్టారు. తల్లిదండ్రులతోపాటు బడుల్లో చదువుకుంటున్న వారి పిల్లలు కూడా సుమారు వంద మందికిపైగా వెళ్లిపోయారు. వలసలను నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. కోసిగి మండలం నుంచి దాదాపు 15వేల కుటుంబాలకు పైగా వలస వెళ్లినట్లు తెలుస్తోంది.



కోసిగి నుంచి కర్నాటక వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న వలస కూలీల వాహనాలు



కంస్గ్యాటీస్ పర్వతంపై చంద్రబాబు చిత్రపటాన్ని చూపుతున్న సురేష్

యానమ్ పర్వతంపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేస్తున్న సురేష్

శిఖరాలు చిన్నబోయేలా..!

- పర్వతాలను సులువుగా ఎక్కేస్తున్న సురేష్
- విద్యార్థి దశ నుంచే ఆసక్తి
- వ్యవసాయ కుటుంబం నుంచి శిఖరాల దాకా
- 21 పర్వతాలను అధిరోహించిన గోనెగండ్ల యువకుడు

పర్వతారోహణ.. ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాగే సాహస యాత్ర ఇది. అందులోనూ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలంటే మామూలు విషయం కాదు. దుర్భేద్యమైన మంచు శిఖరాలను అధిరోహించాలంటే ఒంట్లో సత్తువ ఉండాలి. అంతకుమించి చాలా గుండె ధైర్యం ఉండాలి. శిఖరాల పైకి వెళ్లే కొద్ది ఆక్సిజన్ స్థాయిలు పడిపోతూ ఉంటాయి. కొన్ని సమయాల్లో శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అయిపోతుంటారు. ఎముకలు కొరికే చలిలో, నీరు సైతం గడ్డ కట్టే క్లిష్ట వాతావరణంలో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆ కఠోర ప్రయాణంలో ప్రాణాలను సైతం లెక్క చేయకూడదు. పర్వతారోహణకు ముందు కఠోర సాధన చేయాల్సి ఉంటుంది. అప్పుడే పర్వతాలు తలవంచుతాయి. ఒక్క పర్వతం అధిరోహించాలంటేనే ప్రాణం విలవిల్లాడిపోతుంది. అలాంటిది ప్రపంచ వ్యాప్తంగా 21 పర్వతాలను అధిరోహించాడు కర్నూలు జిల్లా గోనెగండ్ల మండల యువకుడు నరేష్. ఆయన చేసే సాహసయాత్రలకు పర్వతాలు సైతం తలవంచి సలామ్ కొడతాయి. కష్టనష్టాలను ఎదుర్కొని ప్రపంచంలోని ఎత్తయిన శిఖరాలను అవలీలగా అధిరోహిస్తున్న రియల్ హీరోపై ప్రత్యేక కథనం.

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబం నుంచి పేరుప్రఖ్యాతులు పొందే స్థాయికి చేరాడు గోనెగండ్లకు చెందిన సురేష్. ప్రపంచంలో అతికష్టమైన 21 పర్వతాలను సులువుగా అధిరోహించి ఔరా అనిపించాడు. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో 25న జమ్ముకాశ్మీర్ దగ్గర ఉన్న కాజినాగ్ పర్వతం, లెహ్‌లడక్‌లోని పర్వతాన్ని అధిరోహించాడు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన కొంతమంది ఈ పర్వతారోహణకు బయలు దేరారు. 2024 సెప్టెంబరు 25వ తేది వరకు పర్వతారోహణ సాగింది. అనంతరం కాజినాగ్ పర్వతంపై చేరుకున్న సురేష్ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. శిఖరాన చేరుకున్న సురేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఫొటోలను ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన ఎవరెస్టు (8,848 మీటర్లు) పర్వతాన్ని దట్టమైన మంచులో 2017 మే 13వ తేదీన అధిరోహించాడు. ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతం (5898 మీటర్లు) పర్వతాన్ని 2017 డిసెంబరు 25న సురేష్ అధిరోహించాడు.



మంచుకొండలో ప్రయాణిస్తున్న సురేష్

వ్యవసాయ కుటుంబం నుంచి శిఖరాగ్రం వరకు

గోనెగండ్లకు చెందిన వ్యవసాయ కుటుంబం వీరిది. తండ్రి కర్రెన్న, తల్లి సువర్ణమ్మల కుమారుడు సురేష్. వీరికి ఉన్న ఎకరం పొలం ఉంది. మరికొంత పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగించేవారు. సురేష్ 5వ తరగతి వరకు గోనెగండ్ల, 6 నుంచి 10వ తరగతి వరకు అరికేరలో, ఇంటర్మీడియట్ సీ. బెళగల్, డిగ్రీ కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో పూర్తి చేశాడు. అదేవిధంగా శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేసి ప్రస్తుతం రాయలసీమ యునివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాడు.

ఇంటర్ నుంచే ఆసక్తి

గోనెగండ్లకు చెందిన సురేష్ సీ.బెళగల్ మండలంలో ఏపీ గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. 2016లో ఇంటర్ చదివే విద్యార్థుల్లో పర్వతారోహణపై అసక్తి గల విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరం ఎక్కేందుకు ముందుకు రావాలని ప్రభుత్వం ఆహ్వానించింది. దీంతో సురేష్ పేరును కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిపాదించాడు. సీటీఆర్ స్పోర్ట్స్ అకాడమీ సురేష్‌కు కొన్ని రోజులు శిక్షణ ఇచ్చి పంపారు. అక్కడి నుంచి సురేష్ ఇక వెనుతిరిగి చూడలేదు. ప్రపంచంలోని అన్ని పర్వతాలను అధిరోహించాలన్నదే లక్ష్యం పెట్టుకున్నాడు.



స్నేహితులతో పర్వతారోహణలో

అధిరోహించిన పర్వతాలు

ఎవరెస్టు (8,848 మీటర్లు) పర్వతాన్ని దట్టమైన మంచులో 2017 మే 13వ తేదీన అధిరోహించాడు. ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతం (5898 మీటర్లు) పర్వతాన్ని 2017 డిసెంబరు 25న సురేష్ అధిరోహించాడు. ఎంటీ ఎల్‌బ్రోష్ 5642 మీటర్లు 2018 ఆగస్టు 5న ఎంటీ మనస్లు 8163 మీటర్లు 2018 సెప్టెంబరు 29న సౌత్ ఆఫ్రికాలోని అకోయకాగియా పర్వతం 6962 మీటర్లు 2019 జనవరి 4, ఆస్ట్రేలియాలోని 10 ఎత్తైన పర్వతాలతో పాటు కోసిస్కో పర్వతం 2228 మీటర్లు 2019 మార్చి 3న, నేపాల్‌లోని లోహిట్‌సీ పర్వతం 8516 మీటర్లు 2019 మే 29న ఇండియాలోని రుదుగైరా పర్వతం 5819 మీటర్లు 2020 అక్టోబరు 19న, జమ్ము కాశ్మీర్‌లోని కంగ్రీ పర్వతాన్ని 6100 మీటర్లు 2021జనవరి 15న మంగన్‌కట్ పర్వతాన్ని 3700 మీటర్లు, 2021 ఏప్రిల్ 18న, టీస్‌టాపిక్ పర్వతాన్ని 4700 మీటర్లను 2021 ఏప్రిల్ 22న, పటీల్స్ పర్వతాన్ని 2021 ఏప్రిల్ 25న, 2022 జూలై 2వ తేదిన హిమాచల్ ప్రదేశ్‌లోని యానమ్(6111మీటర్లు) పర్వతాన్ని అధిరోహించాడు. వీటితో పాటు మరో ఏడు పర్వతాలను అధిరోహించాడు.

అధికారుల సహకారంతోనే : సురేష్



కుటుంబసభ్యులతో సురేష్

గతంలో ఎంతో మంది నాకు సహకారం అందించారు. ప్రస్తుతం నేను రాయలసీమ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్నా. ముఖ్యంగా నన్ను అధికారులు, ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహించి సహకరించారు. 21 పర్వతాలను అధిరోహించడం చాలా ఆనందంగా ఉంది. జీవితంలో ఇలాంటివి మరెన్నో సాధించాలన్న తపన ఉంది. అందుకోసం ఎంతైనా కష్టపడటానికి సిద్ధం.

ఎంహెచ్‌ఓ కొనసాగింపునకు ప్రయత్నాలు

ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కమిషనర్ లేఖ

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పని చేస్తున్న మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి(సివిల్ అసిస్టెంట్ సర్జన్) సేవలు మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కమిషనర్ లేఖ రాసారు. రాష్ట్ర ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఈ మేరకు కోరినట్లు తెలిసింది. అయితే 2022 అక్టోబర్‌లో నగర పాలక సంస్థకు వచ్చిన ఎంహెచ్‌ఓ 2023 అక్టోబర్‌కు డిప్యుటేషన్ ముగిసింది. అయితే మరో ఏడాది అంటే 2024 వరకు పొడిగించుకున్నారు. ఈ క్రమంలో 2025 అక్టోబర్ వరకు మరో ఏడాది సేవలు అందించేలా ఆ శాఖ డైరెక్టర్‌కు పంపినట్లు తెలిసింది. ప్రధానంగా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వైద్యులు కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే ఫారిన్ సర్వీస్ కింద నగర పాలక సంస్థలో పని చేయాలని నిబంధనలు ఉన్నాయి. అయితే గతంలో పని చేసిన భాస్కర్‌రెడ్డి కూడ మూడు సంవత్సరాలు ఇక్కడే పని చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం కే. విశ్వేశ్వరరెడ్డి కూడ మరో ఏడాది ఇక్కడే ఉండేలా ఓ మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ సిఫారసు చేసినట్లు తెలిసింది. అయితే త్వరలో ఎంహెచ్‌ఓను మరో ఏడాది కొనసాగించేలా ఆ శాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు విడుదల అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నగర పాలక సంస్థలో ఇద్దరికి పదోన్నతి



కమిషనర్ ఎస్. రవీంద్రబాబు నుంచి పదోన్నతి పత్రాలు అందుకుంటున్న ఉద్యోగులు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పదోన్నతులు పొందిన ఉద్యోగులు నియామకపత్రాలు అందుకున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో రెండు సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు సీనియారిటీ ప్రకారం ఇద్దరికి పదోన్నతి ఇవ్వాలని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చింది. దీన్ని సభ్యులు ఆమోదించారు. దీంతో సీనియర్ అసిస్టెంట్లు టి. అబ్దుల్ వాజీద్, కే. రామక్రిష్ణలకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు.

తవ్వేకొద్దీ అవినీతి..!

(5వ పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం ఇద్దరు కాంట్రాక్టర్ల పేరిట జోన్ మండలంలో 33, బేతంచర్ల మండలంలో 12, వెల్దుర్తి మండలంలో 4, ఆస్పరి మండలంలో 5 పనులకు బోగస్ రికార్డులు తయారు చేసి దాదాపు రూ.5.25 కోట్లకు బిల్లులు పెట్టారు. 41 పనులకు సుమారుగా రూ.4 కోట్లు బిల్లులు మంజూరు చేయించుకుని స్వాహా చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు, క్వాలిటీ సెల్ ఇంజనీర్ల సంతకాలు ఫోర్జరీ చేసి సీఎఫ్ఎంఎస్ ఖాతాలో బిల్లులు అప్‌లోడ్ చేసి ప్రజాధనం కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఆ రికార్డులు పరిశీలిస్తే దాదాపు 50 పనులకు 2019 మార్చి 14,18,21,24 తేదిల్లో అగ్రిమెంట్ చేసినట్లు ఉంది. అయితే అదే 2019 మార్చి 10న భారత సార్వత్రిక ఎన్నికలు-2019 షెడ్యూల్ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ అమలులో ఉండగా ఎలాంటి అభివృద్ధి పనులు మంజూరు, అగ్రిమెంట్ చేయకూడదు. ఎన్నికల కోడ్ అమల్లో తేదీల్లో అగ్రిమెంట్ చేసినట్లు చూపిన బిల్లులు ఇంజనీర్లు ఎలా అప్‌లోడ్ చేశారు..? ఇవి పక్కాగా బోగస్ బిల్లులే అన్నది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఆ పనులకు క్వాలిటీ సర్టిఫికెట్ (క్యూసీ) సంబంధిత క్వాలిటీ సెల్ ఇంజనీరు జారీ చేయకపోయినా ఫోర్జరీ సంతకాలతో క్యూసీలు సృష్టించినట్లు తెలుస్తుంది. నాడు వైసీపీతో అంటకాగిన ఇంజనీర్ల అండతోనే ఈ భాగోతం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

మరో రూ.2 కోట్లకు స్కెచ్

దొంగ బిల్లులతో రూ.కోట్లు స్వాహా చేసిన కాంట్రాక్టర్లకు ధనదాహం తీరలేదేమో.. తాజాగా మరో దాదాపు రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఫోర్జరీ సంతకాలు, బోగస్ రికార్డులతో దొంగబిల్లులు పెట్టారు. గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామం సమీపంలోని మల్లెల వాగుపై మూడు, గంజేహల్లి గ్రామ సమీపంలోని మల్లెల వాగుపై మూడు చెక్ డ్యాంలు, ఆదోని మండలం తుమ్మలవాగుపై ఒక చెక్ డ్యాం నిర్మించినట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లతో రూ.57.10 లక్షలకు బిల్లులు పెట్టారు. గోనెగండ్ల మండలం బైచిగేరి గ్రామం తుమ్మలవాగులో చెక్ డ్యాం కట్టినట్లు చూపారు. గోనెగండ్ల మండలంలో బైచిగేరి గ్రామమే లేదు. ఆదోని మండలంలో ఉన్నా.. ఆ పల్లెలో విచారిస్తే తుమ్మలవాగే లేదంటున్నారు. ఆస్పరి మండలం జోహరాపురం పాతమాగి వంక, కైరుప్పల గ్రామం సమీపంలో ఎర్రనీళ్ల వంక, బైలుపత్తికొండ గ్రామం వనం వంక, ఆస్పరి సమీపంలో ముల్లవాగు, రెడ్డివాగుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు.. ఆ ఐదు పనులకు రూ.44.02 లక్షలు బిల్లులు పెట్టారు. అదేవిధంగా పుప్పాలదొడ్డి గ్రామంలో పుప్పాలదొడ్డి వంక, ఆస్పరి సమీపంలో పెద్దనల్లవాగు వంక, చిన్ననల్లవాగు వంక, యాటకల్లు గ్రామ సమీపంలో ఒడ్లోని వంకలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు నాలుగు పనులకు దాదాపు రూ.35.80 లక్షలకు దొంగ బిల్లులు పెట్టారు. వీటితో పాటు ఆదోని, పత్తికొండ, ఆలూరు మండలాల్లో కూడా దొంగ బిల్లులు పెట్టి నిధులు స్వాహాకు ఎత్తులు వేసినట్లు సమాచారం. 'మేము పని చేసిన సమయంలో ఒక్క పని కూడా చేయలేదు. మా సంతకాలు ఫోర్జరీ చేసి బిల్లులు పెట్టారు. ఆ బిల్లులు చెల్లించవద్దు.. మాకు న్యాయం చేయండి..' అంటూ అప్పట్లో పనిచేసిన ఇంజనీర్లు శనివారం జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డిని కలసి వినతిపత్రం ఇవ్వడం కొసమెరుపు.



గోనెగండ్ల మండలం గంజేహల్లి సమీపంలోని మల్లెల వంక ఇది. దీనిపై మూడు చెక్ డ్యాంలు నిర్మించినట్లు రూ.29.50 లక్షలకు ఫోర్జరీ సంతకాలతో ఓ కాంట్రాక్టరు రికార్డులు సృష్టించాడు. దీనికి బిల్లులు చెల్లించాలని ఇంజనీర్లు సీఎఫ్ఎంఎస్ ఖాతాలో అప్‌లోడ్ చేశారు.

ఆ రికార్డులు తనిఖీ చేస్తే

2019 మే 30న వైసీపీ ప్రభుత్వం కొలువుదీరింది. నీరు-చెట్టు పనుల్లో అక్రమాలు జరిగాయని పనులు, బిల్లులు చెల్లింపు ఆపేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నీరు-చెట్టు కింద 2019 మార్చి ఆఖరి వరకు ఎన్ని పనులు మంజూరు చేశారు, ఎన్ని పనులు అగ్రిమెంట్ చేశారు, ఏఏ పనులు మొదలు పెట్టి ఎంత ఖర్చు చేశారు, చెల్లించిన బిల్లులు ఎంత..? జలవనరుల శాఖ డివిజన్ స్థాయి ఇంజనీర్ల నుంచి వివరాలు సేకరించారు. అదే ఏడాది విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా నీరు-చెట్టు పనులు రికార్డులు రెండుసార్లు తీసుకున్నారు. అవే అసలైన రికార్డులు అని ఇంజనీర్లు అంటున్నారు. ఆ పనుల వివరాలు, వైసీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు అప్‌లోడ్ చేసిన పనుల వివరాలు సమగ్రంగా తనిఖీ చేస్తే అవినీతి భాగోతం బట్టబయలయ్యే అవకాశం ఉంది.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

మాజీ మంత్రి టీజీ వెంకటేశ్



ప్రసంగిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, చిత్రంలో మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగర శివారులోని శ్రీగాయత్రి గోశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి టీజీ భరత్, టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి తమ కుటుంబం నిరంతరం అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని నిలిపేందుకు తనవంతు కృషి చేస్తున్నానని అన్నారు. అనాదిగా ఇతర సామాజిక వర్గాల్లో మత మార్పిడులు జరిగాయని, ఆర్యవైశ్య సామాజిక వర్గంలోనే మత మార్పిడి జరగకుండా పద్ధతి ప్రకారం ముందుకు సాగుతున్నారని అన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తన తండ్రి టీజీ వెంకటేశ్ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, వాటిని స్ఫూర్తిగా తీసుకొని తాము ముందుకు సాగుతున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఏ విపత్తు వచ్చినా ముందుగా స్పందించేది ఆర్యవైశ్యులేనని, ఇది ఎన్నో సందర్భాల్లో నిరూపితమైందని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి భరత్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సామాజిక వర్గం ప్రముఖులు పాల్గొన్నారు.

పీఎం ఉపాధి కల్పనతో యువత ప్రగతి బాట

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకుని పారిశ్రామికరంగంలో గుర్తింపు పొందాలని పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి జీఎం అరుణ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతీ యువకుల కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని అన్నారు. పరిశ్రమల కేంద్రం ద్వారా ఈ పథకాలను వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా తయారీ రంగ కార్యకలాపాలకు 50 లక్షల రుణ సాయంతో పాటు సేవా రంగ విభాగానికి రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందని లబ్ధిదారుని వాటా కేవలం 5 నుంచి 10 శాతం మాత్రమే ఉంటుందని తెలిపారు. నూతన మైక్రో యూనిట్లకు మాత్రమే ఈ ఆర్థిక సాయం లభిస్తుందని ఈ పథకం ద్వారా వ్యాపార అభివృద్ధికి బాటలు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ ఉత్పత్తుల తయారీ కోసం రూ.1 కోటి దాకా బ్యాంకు రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందడానికి 18 ఏళ్లకు పైన వయస్సు ఉన్న వారు అర్హులని అన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ షెడ్యూలు ఇదే



కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల క్రీడల షెడ్యూల్ (వేదిక) ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్ ఆదివారం ప్రకటించారు. అండర్ 14, 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ టెన్నిస్ పోటీలు 6, 7 తేదీల్లో పులివెందుల వేదిక ఖరారు చేశారు. అలాగే ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు అండర్-17 హాకీ నెల్లూరులో, స్విమ్మింగ్ అండర్-14, 17 బాలబాలికలకు 5 నుంచి 7వ తేదీ వరకు పల్నాడు జిల్లాలో జరుగుతుందని తెలిపారు. 7 నుంచి 9వ తేదీ వరకు అండర్-14 ఖో-ఖో పల్నాడు జిల్లా, నవంబరు 9 నుంచి 11వరకు అండర్-14 బాలబాలికలకు విశాఖపట్నం గాజువాక, అండర్-17 నెట్‌బాల్ బాలబాలికలకు ఈ నెల 8 నుంచి 10 వరకు నెల్లూరులోని ఆత్మకూరులో జరుగుతాయని అన్నారు. వాలీబాల్ అండర్-14 బాలబాలికలకు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు విజయనగరంలోని భోగాపురం, అండర్-17 బాలుర నెట్‌బాల్ 8 నుంచి 10 వరకు నెల్లూరు ఆత్మకూరులో, అండర్-17 బాలబాలికలకు నవంబరు 9 నుంచి 10 వరకు రేణిగుంటలో, అథ్లెటిక్స్ అండర్-14 బాలబాలికలకు ఈ నెల 6 నుంచి 7వరకు ఏలూరులోని టంగుటూరులో, బాల్‌బాడ్మింటన్ ఈ నెల 6 నుంచి 7 వరకు అండర్-14 బాలబాలికలకు శ్రీకాకుళంలో, 8, 9 తేదీలలో అండర్-14, 17 బాలబాలికలకు మల్కాంబ్ పోటీలు, వెస్ట్ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శులు తెలిపారు.

అద్భుతం ఆవిష్కృతం

- ఓంకారేశ్వరుడిపై ఆదిత్యుడి కిరణాలు
- కార్తీక మాసంలో సూర్యకిరణాల ప్రసరణ

శిరివెళ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఓంకారేశ్వరుడిపై భానుడి కిరణాలు స్పృశించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పవిత్రమైన కార్తీక మాసంలో ఆలయ గర్భగుడిలోని ఓంకారేశ్వర స్వామిపై సూర్య కిరణాలు నేరుగా ప్రసరిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. కార్తీక మాసం ప్రారంభంలోని పాడ్యమి నుంచి అమావాస్య వరకు 30 రోజుల పాటు ఇలా ఆదిత్యుడు ఓంకారేశ్వరుడిని తాకుతాడని ఆలయ అర్చకుడు కేశవ శర్మ వెల్లడించారు. ఆదివారం సూర్యోదయం అనంతరం 6:20 గంటల నుంచి దాదాపు 20 నిమిషాల పాటు సూర్య కిరణాలు స్వామి వారిపై ప్రసరిస్తున్నాయి. కాగా శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వామి ఆలయం 1,464లో ప్రతాపరుద్ర మహారాజు నిర్మించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది.



ఓంకారేశ్వరస్వామిపై ప్రసరిస్తున్న సూర్య కిరణాలు

జింక మృతి

మిడుతూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుమూరు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో జింక మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. డీఆర్వో జిహాన్ తహేర్‌ను వివరణ కోరగా జింక కుక్కల దాడిలో మృతి చెందిందా? లేక మరేదైనా కారణం ఉన్నదా? అనేది తెలియాల్సి ఉన్నదని అన్నారు.

విష పురుగు కాటుతో ఉపాధ్యాయుడి మృతి

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌కు చెందిన భాను ప్రకాష్ (30) అనే ఉపాధ్యాయుడు విష పురుగు కాటుతో మృతి చెందాడు. భాను ప్రకాష్ పాముల పాడు మండలం జూపాడుబంగ్లాలో గురుకుల పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవా రుజామున 2 గంటల ప్రాంతంలో నిద్రపోతున్న ఆయనను విషపురుగు కాటేసింది. తల్లి చిట్టెమ్మను, సోదరుడు కళ్యాణ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మౌనిక (19) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మౌనిక పదో తరగతి దాకా చదివి, ఆ తర్వాత మానసిక సమస్యతో బాధపడుతూ చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. శనివారం తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, ఎల్లమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే.. మౌనిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు మౌనిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో రైతుకు అస్వస్థత


చికిత్స పొందుతున్న చంద్రశేఖర రెడ్డి

మిడుతూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుచెర్ల గ్రామనికి చెందిన చంద్రశేఖరరెడ్డి ఆదివారం తన పొలంలో సేద్యం చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పక్కపొలంలో పని చేస్తున్న అతని భార్య సెల్‌ఫోన్‌లో బంధువులకు సమాచారం ఇచ్చింది. వారు చేరుకుని చంద్రశేఖర్‌రెడ్డిని మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పశ్చిమ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- అసంపూర్తిగా హంద్రీ-నీవా, పందికోన జలాశయం, కుడి, ఎడమ కాలువలు
- కరువు, వలసలను నివారించాలి
- నేడు జిల్లా ఇన్‌చార్జి, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రాక


నిమ్మల రామానాయుడు

కర్నూలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం మౌర్య ఇన్ హోటల్‌లో జరిగే టీడీపీ కూటమి నాయకుల సమావేశంలో్లి 0పాల్గొంటారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగే జిల్లా అభివృద్ధి సమీక్ష (డీడీఆర్‌సీ) సమావేశంలో పాల్గొంటారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి జిల్లాకు వస్తున్న నిమ్మల రామానాయుడుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జలవనరుల శాఖ మంత్రి కావడంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అసంపూర్తి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, ప్రగతి పరుగులు పెట్టిస్తారని రైతులు ఆశిస్తున్నారు. గుండ్రేవుల జలాశయం, సిద్ధేశ్వరం అలుగుపై కీలక నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటున్నారు.

- మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారించే లక్ష్యంగా 2019 జనవరిలో నాటి టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువకు శ్రీకారం చుట్టింది. 40 వేల ఎకరాలకు సాగు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించే ఈ కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు మంజూరు చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన పనులు మొదలు పెట్టారు. ప్రధాన కాలువ, కోటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పురోగతి అటకెక్కింది.
- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పురోగతి పడకేసింది. వేదవతి ప్రాజెక్టు పనులు 6 శాతమే జరిగాయి.
- గాజులదిన్నె జలాశయం సామర్థ్యం 4.5 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీలకు పెంచాలనే గత వైసీపీ ప్రభుత్వంలో రూ.35 కోట్లతో పనులు చేపట్టారు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. రెండు క్రస్ట్‌గేట్లకు కొత్త గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఈ పనులపై దృష్టి సారించాల్సి ఉంది.
- హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువలు, పంటల కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 61,394 ఎకరాలకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. అసంపూర్తి పనులకు రూ.200 కోట్లు ఇవ్వాలి. హంద్రీనీవా నుంచి 68 చెరువులను నింపే ఎత్తిపోతల పథకం నిర్వహణ సిబ్బందిని నియమించడానికి నిధులు మంజూరు చేయాలి.
- కేసీ కాలువ పరిధిలో అలగనూరు జలాశయం 2.96 టీఎంసీలు సామర్థ్యం. మట్టి ఆనకట్ట కుంగిపోయి ఐదేళ్లు దాటింది. వైసీపీ ప్రభుత్వంలో మరమ్మతులకు నోచుకోలేదు. రూ.26.33 కోట్ల నిధులు అవసరమని ఇంజనీర్లు అంటున్నారు. దీనిపై మంత్రి దృష్టి సారించాలి.


ముళ్లకంపతో నిండిపోయిన పత్తికొండ జలాశయం

గుండ్రేవుల, సిద్ధేశ్వరంపై దృష్టి పెట్టాలి


అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కేసీ కాలువకు 31.90 టీఎంసీలు నీటి వాటా ఉన్నా.. నిల్వ చేసుకునే జలాశయం లేదు. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంలో తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.2,980 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంతర్ రాష్ట్ర సమస్య అనే ముద్ర వేసి అటకెక్కించారు. తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలి. శ్రీశైలం జలాశయం ఎగువన సంగమేశ్వరం దగ్గర సిద్ధేశ్వరం అలుగు, బ్యారేజీ నిర్మించాలని రాయలసీమ రైతులు కోరుతున్నారు. ప్రతిపక్ష నేతగా నాడు చంద్రబాబు, పాదయాత్రలో యువనేత నారా లోకేశ్ ఈ ప్రాజెక్టులపై సానుకూలంగా స్పందించారు. టీడీపీ ప్రభుత్వం రాగానే సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి ఈ ప్రాజెక్టుల అవసరాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సీమ రైతుల స్వప్నం సాకారమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలింత కుటుంబ సభ్యులు

- మృతదేహంతో ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆదివారం ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామానికి చెందిన సుజాత ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో శనివారం డెలివరీకి వచ్చినట్లు భర్త మల్లేష్ తెలిపారు. తన భార్య గర్భం దాల్చినప్పటి నుంచి ఆ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలిపారు. శనివారం పురిటి నొప్పులతో ఆసుపత్రికి రాగా సిజేజరియన్ చేశారని, ఆ సమయంలో రక్తస్రావం జరిగిందని, అయితే మరొక సారి కుట్లు వేయడం వల్ల రక్తస్రావం అధికమైందని చెప్పారు. వైద్యులు కర్నూలుకు తీసుకెళ్లాలని చెప్పడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లామని, అయితే బాలింత అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. దీంతో ఆదివారం ఉదయం సుజాత మృతదేహాన్ని ఆసుపత్రి ముందు ఉంచి ఆదోని-మంత్రాలయం హైవేపై కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే సుజాత మృతి చెందిందని ఆరోపించారు. న్యాయం చేసేదాకా ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. సీఐ సుదర్శన్ రెడ్డి చేరుకుని, సమస్య ఉంటే స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని చెప్పి స్టేషన్ తీసుకెళ్లారు. బాధితులకు న్యాయం చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో సుజాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకొని వెళ్లిపోయారు.

దైవదర్శనానికి వెళ్తూ పరలోకానికి

- ఆదోని మండలం గణేకల్లులో రెండు ఆటోలు ఢీ
- ఇద్దరు దుర్మరణం, 8 మందికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం


మృతులు రత్నాబాయి, ఈసన్న (ఫైల్)


ప్రమాదంలో బోల్తాపడిన ఆటో

ఆదోని రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అతివేగం, రాంగ్ రూట్ రెండు ప్రాణాలను బలిగొంది. దైవదర్శనానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన మరో ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా ఎనిమిది మంది తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదోని మండలం గణేకల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మృతులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన రత్నాబాయి(50), ఈసన్న(45)గా గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బళ్లారికి చెందిన వస్త్రాల వ్యాపారి రవిరావు రత్నబాయి కుమార్తె వివాహం డిసెంబరు నాలుగోతేదీన ఖరారైంది. ఆ వివాహానికి సంబంధించి మొదటి పెళ్లి పత్రికను ఉరుకుంద ఈరన్నస్వామికి సమర్పించేందుకు కుమార్తె విద్యశ్రీ, కుమారుడు ఉరుకుంద ఈరన్నరావులతో బయల్దేరారు. ఆదోనికి వచ్చి అక్కడ ఆటోలో ఎక్కారు. చిత్రదుర్గలో ఓవివాహ కార్యక్రమానికి హాజరైన ఈశన్న, తన కోడలు అరుణతో కలసి అదే ఆటోలో ఆదోనిలో ఎక్కారు. వీరితో పాటు మరో నలుగురు కూడా ఉరుకుందకు బయల్దేరారు. డ్రైవర్‌తో సహా 11 మందితో వెళ్తున్న ఆటోను గణేకల్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న మరో ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆటోలోని ప్రయాణికులంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ఘటనలో ఈశన్న అక్కడికక్కడే మృతి చెందగా రత్నబాయి ఆదోని ఆసుపత్రికి తరలించిన వెంటనే చనిపోయింది. అదేవిధంగా ఆటోలో ప్రయాణిస్తున్న బళ్లారికి చెందిన సుకుమార్, కుబేర్, రాజశేఖర్, ఉమాదేవి, డ్రైవర్ అయ్యప్ప, ఉరుకుంద ఈరన్నలు తీవ్రంగా గాయపడ్డారు. విద్యశ్రీ, రవిరావు స్వల్పంగా గాయపడ్డారు.


అంబులెన్స్‌లో తమ్ముడిని తరలిస్తున్న అక్క విద్యశ్రీ

విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా తల్లి రత్నబాయి మృతి చెందడంతో కుమార్తె విద్యశ్రీ, భర్త రవిరావు రోదనలు మిన్నంటాయి. మరో వైపు మృతురాలి కుమారుడు ఉరుకుంద ఈరన్న తీవ్రగాయాలతోనే 'మమ్మీ.. కావాలి..' అంటూ రోదించడం కలచివేసింది. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి


బాలిక కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వైసీపీ నాయకులు

పగిడ్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నాలుగు నెలల క్రితం అత్యాచారం, హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను ఆదివారం వైసీపీ నాయకులు పరామర్శించారు. వైసీపీ అధిష్ఠానం పంపిన రూ.10లక్షల చెక్కును రాంభూపాల్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, అలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ అందజేశారు. రాంభూ పాల్ రెడ్డి మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళ ల రక్షణకు దిశ చట్టాన్ని తీసుకొచ్చి ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామ న్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ముచ్చుమర్రిలో బాలిక హత్యాచారానికి గురై నాలుగు నెలలవుతున్నా మృతదేహాన్ని కూడా గుర్తించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, రమేష్ నాయుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కురవ దూలప్ప (ఫైల్)

ఆలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరికేర గ్రామానికి చెందిన రైతు కురవ దూలప్ప (39) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆదివారం దూలప్ప రెండు ఎకరాల మిరప పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటారు విద్యుత్ తీగ సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూ లిపోయాడు. దూలప్పను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న దూలప్ప మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని ఆలూరు విద్యుత్ డీఈఈ సంతోష్ కుమార్, ఏఈ గురప్ప, ఆలూరు పోలీసులు పరిశీలించారు. మృతుడు దూలప్ప అరికేర గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. దులప్ప మృతి పార్టీకి తీరని లోటని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ అన్నారు. దూలప్ప కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దూలప్ప మృతికి గ్రామ సర్పంచి కుప్పగల్లు నాగరాజు, ఉప సర్పంచ్ లక్ష్మీ నారాయణ, టీడీపీ నాయకులు ఈరన్న, వన్నూర్ వలి, గోపి, రామదాస్ సంతాపం తెలిపారు.

నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో గత సెప్టెంబర్ 18వ తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితుడు పగిడి నరసింహను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో దొంగతనం జరిగిన తీరును, నిందితుడి వివరాలను వెల్లడించారు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన పగిడి నరసింహ అదే గ్రామంలో గత సెప్టెంబర్ 18వ తేదీన బద్రి శ్రీనివాసులు ఇంట్లో చొరబడి దొంగతనం చేశాడు. బీరువాలోని ఒక బంగారు తాళిబొట్టు గొలుసు, ఒక బంగారు నెక్లెస్, బంగారు కమ్మలు, మాటీలు, జుమికీలు, ఒక బంగారు ఉంగరం.. మొత్తం ఆరున్నర తులాల బంగారు వస్తువులు, బీరువాలో ఉన్న నగదు రూ.1,50 లక్షలు, చీరల కింద దాచుకున్న నగదు రూ.7.80 లక్షలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. మొత్తం చోరీ రూ.11.70 లక్షలు దొంగతనం జరిగినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్సై బి.చిన్న పీరయ్య కేసు నమోదు చేసుకున్నారు. ఏఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు సూచనలతో ఆళ్లగడ్డ డీఎస్పీ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్సై బి.చిన్న పీరయ్య, హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్రుడు, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరయ్య, నగేష్, శేషన్న, హుసేన్‌బాషాలతో కూడిన దర్యాప్తు బృందం విచారణ చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు నిందితుడు పగిడి నరసింహను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని నంద్యాల పట్టణంలో అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న టీ స్టాల్ వద్ద అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి చోరీ చేసిన బంగారు సొత్తు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

క్రషర్ మిషన్‌లో పడి యువకుడి మృతి

- రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ఘటన


సురేష్ ఆచారి(ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల పరిధిలోని రామ్‌కో సిమెంటు పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలోని మట్టి క్రసర్ విభాగంలో అసిస్టెంట్ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కడప జిల్లా మైలవరం మండలం ధన్నవాడ గ్రామానికి చెందిన వడ్ల సురేష్‌ఆచారి(28) నైట్ డ్యూటీలో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు క్రసర్ మిషన్ మట్టిలో పడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవికుమార్, సీఐ రమేష్‌బాబు పరిశీలించారు. సురేష్ ఆచారి గత సంవత్సర కాలంగా రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. తండ్రి మరణించగా తల్లి వడ్ల సుబ్బలక్ష్మమ్మ, సోదరుడితో కలిసి సురేష్‌ఆచారి జీవిస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. మృతి వార్త తెలుసుకున్న సురేష్ ఆచారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పలువురు కడప జిల్లా నాయకులు కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీంతో పోలీసుల సూచన మేరకు పరిశ్రమ వర్గాలు బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి, రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

● కర్నూలు ఎంపీ నాగరాజుకు మహిళా సమాఖ్య వినతి



కర్నూలు ఎంపీ నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న సమాఖ్య నాయకులు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎస్.గిడ్డమ్మ కోరారు. ఈ మేరకు ఆదివారం కర్నూలు పార్లమెంటు సభ్యుడు బి.నాగరాజుకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిడ్డమ్మ మాట్లాడుతూ 25 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌పై కూటమి పార్లమెంటు సభ్యులందరూ బిల్లుకు మద్దతు ఇవ్వాలన్నారు. సమావేశాలలో తనవంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర కార్యదర్శి వి.భారతి, రుణుక, పావని, శారద, సుశీలమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలలో డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జోహరాపురం సెంటర్‌లో నిర్వహించిన వేడుకలకు జిల్లా కార్యదర్శి నగేష్ హాజరై మాట్లాడుతూ 1980లో అందరికీ విద్యా, ఉపాధి కావాలంటూ భారతదేశంలోని తరతరాలుగా వస్తున్న కుల మత ప్రాంత లింగ వివక్షతను రూపుమాపాలని డీవైఎఫ్ఐ ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొంది దేశంలోనే అతి పెద్ద యువజన సంఘంగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అమర్, రంగస్వామి, రమణ పాల్గొన్నారు.

● సామ్రాజ్యవాదం నశించాలి-ప్రపంచశాంతి వర్ధిల్లాలి అనే నినాదంతో డీవైఎఫ్ఐ అధ్వర్యంలో జోహరాపురం మాలగేరి నుంచి కిమ్స్ హాస్పిటల్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ పాలస్తీనా, క్యూబాకు భారత ప్రభుత్వం మద్దతు ఇవ్వాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయేల్ చేస్తున్న దాడులను ఆపాలన్నారు.

టీడీపీ కుటుంబంలో భాగస్వాములు కండి

● సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కుటుంబంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని గౌరీశంకర్ కాంప్లెక్స్ సమీపంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రహ్మణపల్లె నాగిరెడ్డితో కలిసి ఆయన 19, 20 వార్డుల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. పెరుగు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతివ్యక్తికీ టీడీపీ శ్రీరామరక్ష అన్నారు. రూ. వంద రూపాయలతో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదబీమా రూ.5 లక్షలతో పాటు పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబానికి పార్టీ అండగా ఉంటూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు.

నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కర్నూలు అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాటుసారాను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న నీలి శికారి ముకుందరావును అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రహస్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నగరంలోని బుధవారపేటలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ విభాగం తనిఖీల్లో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. 20 లీటర్ల సారాతో పాటు, వాహనాన్ని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీదేవి భూదేవి చర ప్రతిష్ట మహోత్సవం

నేడు కల్యాణోత్సవం

కర్నూలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దండిగేరిలో శ్రీదేవి భూదేవి అమ్మవార్ల నూతన చర ప్రతిష్ట మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమం శ్రీసీతారాముల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించారు. టీజీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహావాచనం, పంచగవ్య మేళనం, ప్రదాన దేవత కలశస్థాపన తదితర పూజాదిక్రతువులు నిర్వహించారు. ప్రతిష్టహోమం, మహా బలిదానం, మహా పూర్ణాహుతి హోమం వంటి పూజలు చేశారు. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి దేవతా చర ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి పవళింపు సేవ, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం పంచామృతాభిషేకం, కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు.



అలంకరణలో ఉత్సవమూర్తులు

రోడ్లు బాగుపడేనా?

గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఛిద్రమైన రహదారులే. ఆ రోడ్ల మీద వెళ్లేందుకు వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కోడుమూరు నియోకవర్గంలోని పలు ఆర్‌అండ్‌బీ రహదారులు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారాయి. కంకర తేలి గోతులమయంగా మారిన రహదారుల వైపు గత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం కన్నెత్తి చూడకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించిన టీడీపీ.. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంతో రహదారులకు మరమ్మతులు చేపట్టే బృహత్తర ప్రణాళికతో పనులు ప్రారంభించింది.

- ● రోడ్డంతా గుంతలు
- ● వాహనదారుల బెంబేలు
- ● గాలిలో ప్రాణాలు
- ● పలుచోట్ల అధ్వాన పరిస్థితి
- ● గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) నవంబరు 3 మండలంలోని వెంకటగిరి-గోరంట్ల గ్రామాల రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతల కారణంగా వాహనాలు నడపలేని పరిస్థితి.. కోడుమూరు-వెల్దుర్తి మండల కేంద్రాలను కలుపుతూ రహదారి వెలుతుంది. ఈ మార్గంలో వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి గ్రామాల మీదుగా బస్సులు, ఆటోలు, బైకులు, ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆయా గ్రామ ప్రజలతో పాటు అమడగుంట్ల, చిల్లబండ, ఎర్రదొడ్డి, అనుగొండ గ్రామాలు, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాలకు చెందిన ప్రజలు ప్రయాణం సాగిస్తారు. అయితే వెంకటగిరి సమీపాన, వెంకటగిరి-గోరంట్ల మార్గం, గోరంట్ల-లద్దగిరి మధ్యన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కోడుమూరు నుంచి కొంతదూరం వరకు ఉన్న డబుల్ రోడ్డు తిరిగి గోరంట్ల గురుకుల పాఠశాల తర్వాత నుంచి వెల్దుర్తి వరకు నిర్మించారు. మధ్యలో సింగిల్ రోడ్డు ఉన్న దాదాపు 12 కిమీ దూర ప్రయాణమే వాహనదారులకు నరకంగా మారింది. కాంట్రాక్టర్ మధ్యలో పనులు అర్థాంతరంగా నిలిపేయడంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది.



అధ్వానంగా గోరంట్ల రోడ్డు



గుంతలు పడ్డ రోడ్డు

● అటువైపు వద్దే వద్దు

కోడుమూరు-వెల్దుర్తి రహదారిపై ముఖ్యంగా వెంకటగిరి, గోరంట్ల గ్రామాల మధ్య రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు 5 కి.మీ దూరం ఉంటుంది. అయితే రోడ్డుపై పలుచోట్ల మోకాలులోతు గుంతలు ఉండడంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

● రూటు మార్చుకున్న ఆర్టీసీ:

వెంకటగిరి-గోరంట్ల మార్గంలో రోడ్డు దుస్థితి పట్ల ఆర్టీసీ సైతం రూటు మార్చుకుంది. ఆ మార్గంలో బస్సులు తిప్పడం వలన మరమ్మతులు గురికావడంతో వెంకటగిరి నుంచి చిల్లబండ క్రాస్‌రోడ్డు మీదుగా గోరంట్ల, లద్దగిరి చేరి వెల్దుర్తికి నడుస్తున్నాయి. దీంతో రానుపోను సుమారు 5 కి.మీ అదనపు దూరం పెరిగి డిజిల్‌పై అదనపు భారం పడుతుంది. బస్సులు తరచూ మరమ్మతులకు గురి కావడం మూలంగానే అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

● గత ప్రభుత్వం పట్టించుకోలేదు



గత ప్రభుత్వం డబుల్ రోడ్డు పనులు ఆగిపోయినా చర్యలు తీసుకోలేదు. సుమారు 12 కిమీ మేర డబుల్ రోడ్డు నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయి. కోడుమూరు-వెల్దుర్తి మధ్య వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఉండవు. కూటమి ప్రభుత్వం రెండు రోజుల క్రితం రహదారులను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టిందని, ఈ రోడ్డు మరమ్మతులు త్వరగా చేపట్టాలి.

- తిరుమలనాయుడు, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు

గ్రామీణ రహదారులకు మహర్దశ

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా మారిన రహదారులు బాగు కానున్నాయి. కూటమి ప్రభుత్వం, సీఎం నారా చంద్రబాబు నాయుడు గుంతలయంగా మారిన రహదారులను బాగు చేసేందుకు పనులకు శ్రీకారం చుట్టారు. మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం)లో భాగంగా శనివారం గూడూరు మండలంలోని పెంచికలపాడు నుంచి కోడుమూరు రోడ్డు మరమత్తులకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పూజా కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామీణ రోడ్లు కొత్త శోభను సంతరించుకోనున్నాయి. గూడూరు మండలంలో పెంచికలపాడు బ్రిడ్జి దగ్గర రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు ప్రయాణం వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. గూడూరు నుంచి కర్నూలు వెళ్లే రహదారి అక్కడక్కడ గుంతలు ఏర్పడి అధ్వానస్థితికి చేరువైయింది. గూడూరులోని పెట్రోలు బంకు సమీపంలో రహదారి గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా మండలంలోని గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక ఈ రహదారులన్నింటిని మరమ్మతులతో బాగు చేయనున్నారు. గ్రామీణ రోడ్లు కొత్త శోభను సంతరించుకోనున్నాయి.

మారనున్న రహదారుల రూపు రేఖలు



కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయంతో రహదారుల రూపురేఖలు మారనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయంతో ఎక్కడా రోడ్లు వేయకపోవడం రహదారులు అధ్వానంగా మారాయి. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. గ్రామీణ రహదారులు కొత్త శోభను సంతరించుకోనున్నాయి.

- గజేంద్ర గోపాల్ నాయుడు, గూడూరు

● పనులు త్వరలో ప్రారంభయ్యేలా చూస్తాం

కోడుమూరు వెల్దుర్తి రహదారిలో మిగిలిపోయిన డబుల్ రోడ్డు పనులకు ఎన్‌డీబీ కింద నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీనారాయణ, ఏఈ ఆర్ అండ్ బీ



పెంచికలపాడు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

గ్రామీణ రోడ్లకు మంచి రోజులు వచ్చినట్టేనా?



సి. బెళగల్, నవంబరు 3 ఆంధ్రజ్యోతి : మండలంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అయితే ప్రభుత్వం శనివారం రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చింతమనుపల్లె, పోలకల్లు నుండి, ఎమ్మిగనూరు వరకు, సిబెళగల్ నుంచి పలుకుదొడ్డి సంగాల, తిమ్మనదొడ్డి, గూడూరు నుండి కొత్తకోట, సి బెళగల్ నుంచి బురాన్‌దొడ్డి, పులకుర్తి మీదుగా కోడుమూరు రోడ్లు గుంతలు పడ్డాయి. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యాలు కూడా లేదు.

రహదారుల మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరు

ఓర్వకల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలానికి రూ.2 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆగస్టు 23న గ్రామసభల్లో తీర్మానించిన పనులకు ఆమోదం తెలిపారు. 18 పంచాయతీలకు గానూ 29 పనులు గుర్తించడం జరిగింది. ఇందులో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలతో పాటు 26 గోకులాల షెడ్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సిమెంటు రోడ్లు మండలంలో చురుగ్గా సాగుతున్నాయి. ఓర్వకల్లు గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు కాగా, సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.



ఓర్వకల్లులో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి: మంత్రి

కర్నూలు కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తులసి గ్రూప్ అధినేత రామచంద్ర ప్రభు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని రాహురి గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఉమ్మడి జిల్లా స్థాయి పేద బలిజ మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ, జనరల్ సెక్రటరీ కోనేటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా మంత్రి టీజీ భరత్, తులసి గ్రూప్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత మరొకరికి సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాయలసీమ జోన్ కన్వీనర్ పి. పవన్‌కుమార్, బలిజ సంఘం పెద్దలు కోనేటి చంద్రబాబు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

'హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి'

కర్నూలు కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో చేపట్టిన 'హైందవ శంఖారావం' భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాష్ట్ర కార్యవాహకుడు వేణుగోపాల్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలను సమానంగా చూడాలని రాజ్యాంగం ఇచ్చిన హక్కును కాలరాస్తూ గత భారత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ సమాజాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రార్థన స్థలాలు, ఆస్తుల విషయంలో ఇతర మతాలకు ఇచ్చిన స్వేచ్ఛను అత్యధికంగా ఉండే హిందువుల దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ ఉండడం తీవ్రమైన ఆక్షేపణీయమని అన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ ఆజమాయిషీ పూర్తిగా తొలగించే వరకు ఈ ఉద్యమం ఆగదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, వీహెచ్‌పీ నాయకులు ప్రాణేష్, భానుప్రకాశ్, వీహెచ్‌పీ హైందవ శంఖారావం కోకన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహకుడు రఘువీర్, జిల్లా సంఘచాలక్ ఎన్‌వీఎస్ గుప్త, జిల్లా కార్యవాహకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శంఖారావం కార్యక్రమ కరపత్రం విడుదల చేస్తున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు

టీడీపీ నాయకుడిని పరామర్శించిన కోట్ల

ఎమ్మిగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు చెందిన టీడీపీ నాయకుడు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మల్కాపురం నాగిరెడ్డిని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆదోని నుంచి కర్నూలుకు వెళ్తూ ఎమ్మిగనూరు పట్టణం హెచ్‌బీఎస్ కాలనీలో ఉంటున్న నాగిరెడ్డి ఇంటికి వెళ్లారు. నాగిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కోట్ల వర్గీయులు సుధాకర్‌శెట్టి, కదిరికోట ఆదెన్న, వీరారెడ్డి, కందనాతి శ్రీనివాసులు, పీర్‌బాషా, మల్లికార్జున, కురుమన్న, శ్రీనివాసులు, బీజీ చంద్రన్న, బడేసాబ్, రోజా ఆర్ట్ ఉసేని, బంగారప్ప, సాల్మన్, ప్రసాద్ పాల్గొన్నారు.



టీడీపీ నాయకుడు నాగిరెడ్డిని పరామర్శిసున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలలోని హోటల్స్ రెస్టారెంట్లను ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర శివారులో రోజురోజుకు పుట్టగొడుగుల్లా హోటల్స్, రెస్టారెంట్లు పుట్టుకొస్తున్నాయన్నారు. వీటిలో ఆహారం తయారీలో ప్రజల ఆరోగ్యాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా రుచికరంగా ఉండేందుకు అనేక రసాయనాలు వాడుతూ ఆరోగ్యాలతో చెలగాలమాడుతున్నారని ఆరోపించారు. తక్షణమే అలాంటి హోటల్స్, రెస్టారెంట్లపై దాడులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షకార్యదర్శులు బాబయ్య. బీసన్న, చంటి పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి

సి. బెళగల్, నవంబరు 3 ఆంధ్రజ్యోతి: రైతులు పంటల బీమా తప్పనిసరి నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయఅధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏవో మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి వివిధ బ్యాంక్‌లలో రూణాలు తీసుకున్న రైతులు పంటల రకాలను బట్టి బీమా చేసుకోవాలన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం బీమా అందజేస్తున్నారు. గుండ్రేవుల గ్రామంలో బ్యాంక్‌లో రూణాలు తీసుకుని బీమా కట్టిన రైతులు రైతు భరోసా కేంద్రంలో అన్‌లైన్ నమోదు చేసినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు. ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

13న క్రీడా పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 13న అంతర్ పాఠశాలల 12, 14 సంవత్సరాలలోపు విద్యార్థులకు చెస్, సెవెన్స్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలంపిక్ సంఘం ప్రతినిధులు రామాంజనేయులు తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9393827585ను సంప్రదించాలన్నారు.

రేపు స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన అండర్-14, 17 బాలబాలికలకు బాక్సింగ్, బేస్‌బాల్ ఎంపిక పోటీలు నంద్యాల రామకృష్ణ పీజీ కాలేజీలో ఎన్జీవోస్ కాలనీలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల, కర్నూలు జిల్లాల స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు శ్రీనాథ్, గిడ్డయ్యలు తెలిపారు.

దైవ చింతనతోనే మనుగడ

కేంద్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షురాలు విజయభారతి



ఎస్.విజయభారతిని సన్మానిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతోనే మానవుల మనుగడ సాధ్యమని కేంద్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షురాలు ఎస్.విజయభారతి అన్నారు. ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ సమీపాన గల సురభి గోశాల ట్రస్టు, భారతీయ స్ఫూర్తి కేంద్రంలో హిందూ కార్తిక వనభోజనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి వికాస భారతి సంఘటన్ కార్యదర్శి బీవీ నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయభారతి మాట్లాడుతూ భక్తిభావం అలవర్చుకుంటే సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించవచ్చని అన్నారు. అనంతరం ఎస్.విజయభారతిని పూలమాలతో, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వనభోజన కార్యక్రమంలో భాగంగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో సురభి గోశాల ట్రస్టు అధ్యక్షుడు ఈఎస్ మారుతి కృష్ణన్‌శర్మ, ప్రధాన కార్యదర్శి వంగాల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో సంత

- ఆదాయం ఉన్నా షెడ్లు నిర్మించని ఆలూరు పంచాయతీ అధికారులు
- గుక్కెడు తాగునీరు కూడా లేదు


డేరాలు కట్టుకున్న చిరు వ్యాపారులు



బేస్‌మట్టంతోనే ఆగిపోయిన షెడ్ల నిర్మాణం

ఆలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారపు సంత మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్ కోసం వ్యాపారులు పోటీలు పడి వేలంపాట టెండర్ తగ్గించుకున్నప్పటికీ అక్కడ కనీస వసతులు కల్పించడం లేదు.

తాగు నీటి వసతి కరువు

ప్రతి బుధవారం సంత మార్కెట్‌లో నిర్వహించే ఈ వారపుసంతకు ఆదోని, గుంతకల్లు, ఆస్పరి, పత్తికొండ ప్రాంతాల నుంచి సరుకులను విక్రయించేందుకు వ్యాపారులు వస్తుంటారు. పంచాయతీ అధికారులు షెడ్లు నిర్మించకపోవడంతో మండుటెండల్లో డేరాలు కట్టుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు.

షెడ్డు వేయకుండా వదిలేశారు

సంత మార్కెట్‌లో షెడ్‌ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. బేస్‌మట్టం వరకు నిర్మించి వదిలేశారు. షెడ్లు వేయలేదు. దీంతో వ్యాపారులు నిరాశ చెందుతున్నారు. డబ్బులు వసూలు చేయడం తప్ప పంచాయతీ అధికారులు ఏమాత్రం సౌకర్యాలు కల్పించడం లేదని వారు వాపోతున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవంతో మహిళలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతు న్నారు.. తాగునీరు లేకపోవిడంతో మినరల్ వాటర్ కొనుక్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

షెడ్లు నిర్మించాలి



సంత మార్కెట్‌లో షెడ్లు నిర్మిస్తే వ్యాపారాలు చేసుకునేందుకు బాగుంటుంది. ఎండలో డేరాలు కట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్నాం. మహిళలకు మరుగుదొడ్లు కూడా లేవు. **- గాదిలింగమ్మ చిరు వ్యాపారి**

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పంచాయతీ సంత మార్కెట్‌లో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్లకు పంచాయతీ వారు సూచించిన మేరకే సుంకం వసూలు చేయాలి. అలా పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.. షెడ్ల నిర్మిందుకు జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లాం.
- ప్రభాకర్, ఈవో, ఆలూరు పంచాయతీ

అసాంఘిక కార్యాలపై చర్యలు : డీఎస్పీ

మద్దికెర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో అసాంఘికక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య హెచ్చరించారు. ఆదివారం మద్దికెర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. మట్కా, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని, బెల్టు షాపులు నిర్వహించకూడదన్నారు. పల్లెలు ప్రశాంతంగా ఉండాలని, చిన్న చిన్న సమస్యలకు గొడవ పడకూడదని సూచించారు. ఎస్ఐ విజయకుమార్ నాయక్ ఉన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


కంప్యూటర్ సెంటర్ ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

పత్తికొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పట్టణంలోని రీడింగ్‌రూం ఆవరణలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సింగం శ్రీనివాసులు కుమారుడు ఏర్పాటుచేసిన కంప్యూటర్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. బీటెక్ చదివి ఉద్యోగాలకోసం ఎదురుచూడకుండా సొంత వ్యాపారాన్ని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం యువతకు ఎన్నో స్వయం ఉపాధి పథకాలను అందుబాటులో ఉంచిదన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్రలీగల్‌సెల్ సభ్యులు న్యాయవాది సురేష్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

పని చేయని డీపీఎంఎస్ ఆన్‌లైన్

ఆదోని టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు, లే ఔట్ల మంజూరుకు సంబంధించిన డీపీఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ పది రోజులుగా పనిచేయడం లేదు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్ల మంజూరు ఆగిపోయింది. బ్యాంక్ రుణాలు మంజూరు కావాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా తప్పని సరిగా ప్లాన్ మంజూరు చేసుకోవాల్సి రావడంతో నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ పోర్టల్‌లో కొన్ని మార్పులు చేస్తున్నందున తాత్కాలికంగా పనిచేయడం లేదని, త్వరలో అందుబాటులోకి వస్తుందని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

దొరికిన ఫోన్ స్టేషన్‌లో అందజేత

- యువకుడికి సీఐ రివార్డు


యువకుడికి రివార్డు ఇస్తున్న సీఐ జయన్న

పత్తికొండ, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మక్తూం అనే యువకుడికి ఆదివారం రాత్రి రోడ్డుపై సెల్‌ఫోన్ దొరికింది. తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను ఆ యువకుడు పోలీస్‌స్టేషన్‌లో సీఐ జయన్నకు అందించాడు. నిజాయితీగా సెల్‌ఫోన్‌ను అప్పగించిన యువకుడిని సీఐ అభినందించి, రూ.500 రివార్డు అందజేశారు. కాగా మక్తూం పత్తికొండ డిగ్రీకళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ

తుగ్గలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ లభిస్తుందని మారెళ్ల, ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవోలు మనోహర్‌నాయుడు, గిడ్డయ్య తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు 8.25శాతం వడ్డీ ఇస్తుండగా, ఇతరులకు 7.35శాతం లభిస్తుందన్నారు. అలాగే సొసైటీల్లో క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, జిల్లా సాధికారిత కన్వీనర్ ఎన్. లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందన్నారు. మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. టీటీడీలో బీసీ వర్గానికి చెందిన మల్లెల రాజశేఖర్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మండలంలో దాదాపు రూ.2 కోట్లతో సీసీ రోడ్ల పనులు చేస్తున్నారని, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేతృత్వంలో పత్తికొండ అన్ని విధాలా అభివృద్ధి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడుగు సతీష్ కుమార్, మీసేవా భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో పరిశ్రమలు స్థాపించాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండో ముంబైగా పేరుగాంచిన ఆదోనిలో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పించాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్, మాజీ అధ్యక్షుడు లక్ష్మన్న డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం తిక్కస్వామి దర్గా వద్ద జెండాను ఆవిష్కరించారు. పశ్చిమ ప్రాంత అభివృద్ధిలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. చెంతనే నీరున్న సాగు, తాగునీరు లేక వలసలు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రాంతంలో అత్యధికంగా పత్తి సాగు చేస్తున్నారని కాటన్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. నాగరాజు, నవీన్, వీరేష్, మోహన్, బీమా పాల్గొన్నారు.

నిరూపించకపోతే రాజీనామా చేస్తారా?

- యురేనియం అనుమతులపై ఎమ్మెల్యేకు బొజ్జమ్మ దంపతుల సవాల్


మాట్లాడుతున్న బొజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు

దేవనకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలను తాము అనుమతించినట్లు నిరూపించ కుంటే పదవికి రాజీనామా చేస్తారా? అని ఎమ్మెల్యే విరూపాక్షిని మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొజ్జమ్మ సవాల్ చేశారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలకు 2017లో తాను ఎంపీపీగా ఉన్నప్పుడే తీర్మానం చేశారని ఆలూరు ఎమ్మెల్యే అసత్యపు ఆరోపణ చేశారని ఆధారాలతో ముందుకు రావాలని, లేని పక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరారు. రాజకీయంగా దెబ్బ తీయాలన్న దురాలోచనతోనే తమపై దుష్ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. యురేనియం తవ్వకాలతో అనర్థాలు తమకు తెలుసునని, ప్రజల జీవన మనుగడకు ప్రమాదకరమైన యురేనియం పరిశోధన తవ్వకాలకు ఎలా మద్దతు తెలుపుతామని ప్రశ్నించారు. కప్పట్రాళ్ల సర్పంచ్ చెన్నమనాయుడు మాట్లాడుతూ వెంకటప్ప నాయుడి ఉటుంబంపై ఆరోపణలు చేస్తే సహించమన్నారు. చెల్లెలచెలిమల, బేతపల్లి సర్పంచులు రామప్ప, మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు మల్లయ్య, బడిగింజల రంగన్న, మలకన్న, మల్లికార్జునగౌడ్, రాజశేఖర్‌గౌడ్, తెర్నెకల్ చిన్నవెంకప్ప, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

మద్దికెర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తీపి గుర్తులు స్మరించుకుంటూ నాటి అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. మద్దికెర కేవీఆర్ జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిర పడిన వారు ఒకేచోట కలుసుకున్నారు. స్నేహితులు పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆట పాటలు, విందు పాటలతో ఆ పాఠశాల కోలాహలంగా మారింది.

హుల్తిలింగేశ్వర ఉత్సవాలలో ఎంపీ, ఎమ్మెల్యే


గొరవయ్యల వేషధారణలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ నాగరాజు

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెద్దహుల్తి గ్రామం హుల్తిలింగేశ్వరస్వామి ఉత్సవాలలో శనివారం కర్నూలు ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే శ్యాంబాబు పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న వారికి మాజీసర్పంచ్ తిప్పన్న డప్పువాయిద్యాలు, గజమాలతో స్వాగతం పలికారు. మాజీ జడ్పీచైర్మన్, బత్తిని వెంకటరాముడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుగ్గలినాగేంద్ర, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, బీసీ సెల్ రామానాయుడు పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 5న చలో కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా, విద్యారంగ సమస్యల పరిష్కారం చేయలేదన్నారు. పెండింగ్ విద్యా దీవెన, వసతి దీవెన రూ.3,480 కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీలో మేజర్ మైనర్ విధానాన్ని రద్దు చేసి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి మెస్ చార్జీలను పెంచాలన్నారు. విద్యార్థులు చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి గౌస్, శశిధర్, నాగరాజ్, సంతోష్ గణేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి..

- ఏడుగురిపై కేసు నమోదు

తుగ్గలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల వద్ద బంకు ఏర్పాటు చేసుకున్న వ్యక్తిపై ఏడుగురు దాడిచేశారు. జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్‌గౌడ్ తెలిపిన మేరకు.. బంకు తొలగించాలని తనపై ఏడుగురు వ్యక్తులు దాడి చేసినట్లు బాధితుడు తలారి సుదాకర్ ఆదివారం పిర్యాదు చేశారు. శనివారం రాత్రి శభాష్‌పురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు హనుమంతుతో పాటు మరో ఆరు మంది కొడవలితో దాడి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ గ్రామానికి చేరుకుని ఘర్షణలు చోటుచేసుకోకుండా ప్రపజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యలను ప్రశాంతంగా పరిష్కరించు కోవాలని, గ్రామాల్లో ఇలా దాడులు చేసుకోవడం దారుణమన్నారు. మరోసారి ఇలాంటి దాడులు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


ఆలూరు : మద్యం, బైకుతో పోలీసులు

ఆలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు స్టేషన్ పరిధిలోని ఆస్పరి మండలంలో పది బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ఇంద్ర కిరణ్ తేజ ఆదివారం తెలిపారు. వివరాల మేరకు.. బైక్‌పై మద్యాన్ని తరలిస్తుండగా బోయ నల్లారెడ్డి, వీరాంజి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఏపి39 కేక్యూ 7415 బజాజ్ పల్సర్ బైక్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

హొళగుంద, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లార్తి, గజ్జెహళ్లి, హెబ్బటం గ్రామాలతో పాటు హొళగుందలో పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు. వివరాల మేరకు.. 27మందిని అరెస్ట్ చేసి, రూ.45,490ల నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు.

10న ఓపెన్ చెస్ టోర్నమెంట్


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సభ్యులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నేషనల్ ఇంగ్లీష్ పాఠశాల ఆవరణలో పదో తేదీన ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్పార్క్ చెస్ అకాడమీ కోచ్ జంబులయ్య తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి చెస్ టోర్నమెంట్ పోస్టర్లను విడుదల చేశారు. ఐదేళ్ల నుంచి ఏ వయసు వారైనా పాల్గొనవచ్చుని, వివరాలకు 9885103381 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఐ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి శ్రీధర్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు, మహదేవప్ప పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టు మాల మల్లేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు మల్లికార్జున స్వామి, మల్లయ్య స్వామి ఆదివారం తెలిపారు. తెల్లవారుజాము నుంచి స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలైన మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి అమ్మవాలను దర్శించుకుమని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అడుగుకో గుంత


సిరుగుప్ప రోడ్డులో గుంతమయంగా మారిన జాతీయ రహదారి


ఆదోని-రాయచూరు జాతీయ రహదారి ఇలా..

- గుంతలమయమైన ఎన్‌హెచ్ 167
- హడలిపోతున్న వాహనదారులు

ఆదోని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆదోని నుంచి మంత్రాలయం, రాయచూరు వెళ్లే జాతీయ రహదారి అడుగుకో గుంతలా తయారైంది. ఈ రహదారిపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఆంధ్ర నుంచి కర్ణాటకకు వెళ్లే ఎన్‌హెచ్ 167 అధ్వానంగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ జాతీయ రహదారిని గమనిస్తే ఏదో ఓ గ్రామస్థాయి రోడ్డులా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వలసలు అరికట్టాలి

ఆస్పరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల వలసలను అరికట్టాలని వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ముత్తుకూరులో సమావేశం నిర్వహించారు. ఈనెల 6న జిల్లాలోని సచివాలయాల వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. లింగన్న, తిక్కన్న, రామాంజినేయులు, బాలకృష్ణ, నాగన్న, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటు చేయాలి

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుచేయాలని న్యాయవాదులు ఆదివారం ఎమ్మెల్యేను కోరారు. జూనియర్ జడ్జికోర్టు మాత్రమే ఉండడంతో ఆదోనికి వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడే ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని వారికి హామీఇచ్చారు.

పెద్దనేలటూరులో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో కార్తీకమాసం ఈశ్వరదేవాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని 10నుంచి టెన్నిస్‌బాల్ ఓపెన్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 20న ఈశ్వరదేవాలయం లింగప్రతిష్ఠ, ధ్వజస్తంభప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ టెన్నిస్‌బాల్ ఓపెన్ క్రికెట్‌పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 9వ తేదీలోపు రూ. 500 ప్రవేశ రుసుము చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 15,000, ద్వితీయ బహుమతిగా రూ. 10,016 అందజేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని 21వ వార్డుకు చెందిన ఎం. భాస్కర్ ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన దహన సంస్కారాలకు గాను టీడీపీ కౌన్సిలర్ విజీపీ దయాసాగర్, వార్డు టీడీపీ అధ్యక్షుడు హుస్సేన్ రూ. 5000 బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసహాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతు, రంగమ్మ, సత్యమ్మ, గడ్డం రవి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోసిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగి సమీపంలోని పులికనుమ ప్రాజెక్టు దగ్గరలో ఉన్న చింతల కొండ దగ్గర కోసిగి గ్రామానికి చెందిన ఏడుగురు పేకాట ఆడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.36,200ల నగదుతో పాటు మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు చింతలగేని నర్సారెడ్డి

కోసిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. కోసిగి టౌన్ టీడీపీ ప్రెసిడెంట్ చింతలగేని నర్సారెడ్డి నూతన గృహ ప్రవేశానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, కౌతాళం మండలం టీడీపీ నాయకులు ఉలిగయ్య, సురేష్ నాయుడు, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న వీరేష్ పాల్గొన్నారు. వీరికి చింతలగేని నర్సారెడ్డి పూలమాల శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరేష్, సొట్టయ్య, లక్ష్మన్న, శివ, కోసిగయ్య, గోవిందు, పోతుల వీరారెడ్డి, ఐరంగల్ బసవ పాల్గొన్నారు.

శ్రీ మఠం అన్నదానానికి విరాళం

మంత్రాలయం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన రాఘవేంద్ర అనేభక్తుడు రూ.1.25 లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.1.25 లక్షలు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన కోట్ల


టీడీపీ నాయకుడు నాగిరెడ్డిని పరామర్శిసున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

ఎమ్మిగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు చెందిన టీడీపీ నాయకుడు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మల్కాపురం నాగిరెడ్డిని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆదోని నుంచి కర్నూలుకు వెళ్తూ ఎమ్మిగనూరు పట్టణం హెచ్‌బీఎస్ కాలనీలో ఉంటున్న నాగిరెడ్డి ఇంటికి వెళ్లారు. నాగిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కోట్ల వర్గీయులు సుధాకర్‌శెట్టి, కదిరికోట ఆదెన్న, వీరారెడ్డి, కందనాతి శ్రీనివాసులు, పీర్‌బాషా, మల్లికార్జున, కురుమన్న, శ్రీనివాసులు, బీజీ చంద్రన్న, బడేసాబ్, రోజా ఆర్ట్ ఉసేని, బంగారప్ప, సాల్మన్, ప్రసాద్ పాల్గొన్నారు.

పంటకాలువలో చెత్తాచెదారం

మురుగు కాలువలోకి ఎల్లెల్సీ నీరు

ఎమ్మిగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణాలోపం.. సిబ్బంది నిర్లక్ష్యం.. వెరసి పంట పొలాలకు అందాల్సిన సాగునీరు కాస్తా మురుగు కాలువ పాలవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణ సమీపంలో ఉన్న ఎల్లెల్సీ ప్రధాన కాలువ నుంచి మంత్రాలయం రోడ్డులో ఉన్న వ్యవసాయ క్షేత్రం వరకు ఎల్లెల్సీ పంటకాలువ విస్తరించి ఉంది. ఈ కాలువకింద రైతులకు సంబంధించి పంట పొలాలు ఉన్నాయి. ఈ పొలాలకు ఎల్లెల్సీ ప్రధాన కాలువ నుంచి పంట కాలువ ద్వారా సాగునీరు విడుదల అవుతుంది. అయితే ఈ పంటకాలువపై ఎల్లెల్సీ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటంతో కాలువ వెంబడి అక్కడ అక్కడ ముళ్ల కంపలు, మొక్కలు ఏపుగా పెరిగాయి. కాల్వ వెంట హోటళ్లు వెలిశాయి. నిర్వాహకులు చెత్తాచెదారాన్ని


హెచ్‌బీఎస్ కాలనీలో ఎల్లెల్సీ పంట కాలువకు చెత్త అడ్డుపడటంతో డ్రైనేజీలోకి వృథాగా పోతున్న నీరు


ఎల్లెల్సీ పంట కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారం, కంపచెట్లు

కాలువలో వదులుతుండటం, సమీప నివాస ప్రజలు చెత్తను కాలువలో వేస్తున్నారు. దీంతో నీరు కలుషితం అవటమే కాక చెత్తాచెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడుతోంది. ప్రధానంగా పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని ప్లేగమ్మగుడి, ఎంజీ పెట్రోల్ బంకు సర్కిల్ ప్రాంతంలో నిత్యం కాలువకు చెత్తాచెదారం అడ్డు పడటం సాగునీరు వృథాగా పోతుండటం పరిపాటిగా మారింది. శనివారం సైతం ప్లేగమ్మ గుడి దగ్గర నుంచి సమీపంలోని మురుగుకాలువలోకి పంటకాలువ నుంచి సాగునీరు వృథాగా పోతున్నాయి. గంటల తరబడి సాగునీరు మురుగు కాలువలోకి వెళ్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అధికారులు స్పందించి పంట కాలువ నుంచి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డుపైనే చెత్త


తేరుబజారు మైదానంలో చెత్త కుప్ప

కోసిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని తేరుబజారు మైదానంలో సుమారు 250 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. తేరుబజారు మైదానం మొత్తం చెత్తకుప్పలా మారింది. ఇటు దేవాదాయ శాఖ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో కోసిగి మొత్తం చెత్తదిబ్బలా తయారైంది. ఊరి నడిరోడ్డులో చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో వ్యాపారస్తులు, ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి


ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న పాలకుర్తి శ్రీనివాసరెడ్డి

కోసిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోసిగి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పరి శ్రీనివాస్ కుమారుడు తరుణ్ తలసేమియా వ్యాధితో బాధపడుతుండటంతో హైదరాబాదు హాస్పిటల్‌లో చికిత్స కోసం వెళితే.. దాదాపు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. దాంతో కోసిగి చెందిన టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల భరద్వాజశెట్టి ద్వారా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు ఐటీడీపీ మంత్రాలయం నియోజకవర్గం టీం సోల్మాన్ రాజు, హనుమంతు, దుద్ది నగేష్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో తరుణ్ వైద్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.10లక్షల సాయం చేశారు. ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తరుణ్ తండ్రి ఉప్పరి శ్రీనివాస్‌కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసేందుకు అండగా ఉంటామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఉల్లి రైతు బేజారు

● ధర తగ్గిన ఉల్లి
● ఊసురుమంటున్న ఉల్లి రైతు
● అధిక వర్షాలదెబ్బకు ఊరని ఉల్లిగడ్డ
● మార్కెట్‌లో పలుకని గిట్టుబాటు ధర
● వీధుల్లో కేజీల ప్రకారం అమ్ముకుంటున్న రైతులు



గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల కారణంగా ఉల్లి పంటకు మజ్జిగతెగులు సోకింది. దీంతో ఉల్లి చిన్నసైజ్‌గా ఉంటుండడంతో ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో దాదాపు 5000 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ఎకరానికి పెట్టుబడి దాదాపు రూ.80వేల నుంచి రూ. 90వేల వరకు



పెట్టామని రైతులు తెలిపారు. తీరా గత పది రోజులుగా ఉల్లి ధర తగ్గుముఖం పట్టింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింటం ధర రూ. 500 నుంచి రూ. 1800లకు ధర మించి పలకడం లేదు. గరిష్ఠ ధర రూ. 4వేలు ఉన్నప్పటికీ ఆ ధరకు ప్రస్తుతం ఉల్లి పోవడం లేదు. మార్కెట్‌కు పోతే రవాణా ఖర్చులకు కూడా రావని తలచి ఇక చేసేది లేక రైతులు పొలాల దగ్గరనే వ్యాపారులకు క్వింటం ధర రూ. 1000 నుంచి రూ. 1500 లోపు విక్రయిస్తున్నారు. అయితే తెలంగాణలో నైనా ధర పలుకుందేమోనని గోనెగండ్లకు చెందిన కొందరు ఉల్లి రైతులు హైదరాబాద్‌కు మార్కెట్‌కు వెళ్లి అమ్మకాలు జరిపి వచ్చారు. అక్కడ కూడా క్వింటం ధర రూ. 1500 మించి పలకకపోవడంతో ఇక చేసేది లేక ఆటోల్లో వేసుకొని గ్రామాల్లో తిరుతూ రూ. 100 కు ఐదు కేజీల ప్రకారం అమ్ముకుంటున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా సగానికి పడిపోయింది. ఎకరానికి 300 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 200 బస్తాలకు మించి రాలేదని రైతులు తెలుపుతున్నారు. కష్టపడి పండించిన పంటను వీధుల్లో తిరుగుతూ కేజీ ప్రకారం అమ్మాలు జరుపుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి డబ్బులు కూడా రాలేదు



ఎకరం పొలంలో ఉల్లి పంట సాగు చేశాం. అధిక వర్షాలకు పంట దిగుబడి కూడా దెబ్బతిన్నది. గడ్డకూడా ఊరలేదు. పెట్టుబడి కింద రూ. 80వేలు వచ్చింది. పంట చేతికి అందే సమయానికి కర్నూలు మార్కెట్ లో ధర లేకపోవడం, ఆన్‌లైన్ సమస్య ఉన్న కారణంగా అమ్మకాలు జరగక పోవడంతో హైదరాబాద్‌కు పంటను తీసుకొని వెళ్లగా అక్కడి మార్కెట్ లో క్వింటం రూ. 1500 కొన్నారు. రూ. 40వేలు చేతికి వచ్చింది. పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా చేతికి రాలేదు.

\- కబుల్‌బాషా, ఉల్లి రైతు


ఆటోలో ఉల్లిని అమ్ముతున్న దృశ్యం

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి


మాట్లాడుతున్న అంజిబాబు, అధ్యక్షుడు రాజు నాయక్

మంత్రాలయం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు అంజిబాబు కోరారు. ఆదివారం పట్టణంలోని రాగసుధ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ25వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించి, రాజకీయ బెదిరింపులు ఆపాలని కోరారు. అనుభవం ఉండి అర్హత ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి వీరేష్ నాయక్, జిల్లా కోశాధికారి వీరేష్, మహిళా కార్యవర్గ నాయకురాలు ఈరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ల నాయకులు మజ్జిగ బొజ్జప్ప, నారాయణరెడ్డి మహబూబ్, విశ్వనాథ్, బాలు, రామాంజి, అర్జున్, తాయప్ప, శేఖర్, జిల్లాలోని వివిధ మండలాల అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణాలపై దాడులు


గోనెగండ్ల రేషన్ దుకాణాల్లో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని రేషన్‌దుకాణాలపై శనివారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గోనెగండ్లలో 11 రేషన్‌దుకాణాలు ఉండగా అందులో ఎనిమిది దుకాణాలను అధికారులు రికార్డులను, స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. అందులో 1320004 అనే రేషన్‌దుకాణంలో 143 కేజీల బియ్యం తక్కువ వచ్చినట్లు అధికారుల విచారణలో తెలింది. అయితే ఆ దుకాణం యజమాని తన దగ్గర బియ్యం తక్కువ లేవు లెక్క ప్రకారం ఉన్నాయి. మిగతా బియ్యం ఎంబీయూ దగ్గర ఉన్నాయని తెలిపినప్పటికీ అధికారులు వినలేదని ఎంబీయూతో రిటర్న్ కొట్టించి తన దగ్గర తక్కువ ఉన్నట్లు లెక్క చూపారని రేషన్ దుకాణం యజమాని వాపోయాడు. తాను ఎంత చెప్పినప్పటికి అధికారులు వినిపించుకోక పోవడమే గాక తన పై కేసు నమోదు చేయడం పట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 1320036 రేషన్‌దణంలో 1115 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్లు విచారణలో తెలింది. అయితే ఈ రెండు దుకాణాల పై 6ఏ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రామకృష్ణ, సునీల్‌కుమార్ ఆదివారం సాయంత్రం విలేకరులకు చెప్పారు. మిగతా ఆరు దుకాణాలను తనిఖీలు చేసి ఇర్రెగ్యులర్ కింద హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో సిద్ధయ్య, రమణ, వీర్వోలు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులతో అప్రమత్తం

శనివారం రాత్రి గోనెగండ్లలోని రేషన్ దుకాణాలపై ఆకస్మికంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించడంతో మండలంలోని పలు గ్రామాలలో ఉన్న రేషన్‌షాపుల డీలర్ల అప్రమత్తమయ్యారు. మండల వ్యాప్తంగా 43 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. ఇంత వరకు ఎప్పుడు అర్ధరాత్రి వరకు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసిన సంఘటనలు లేవు. ఇప్పడు జరగడంపై డీలర్లు తమ తప్పుఒప్పులను సరిచేసుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు.

కందిపోతోంది..!

కంది పూతను తినేస్తోంది- శనగ పచ్చపురుగు, కాయ ఈగ దెబ్బ


పచ్చపరుగుసోకిన దృశ్యం

గోనెగండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా కనిపించినా ఉదయం పూట పొగ మంచు కమ్ముకుంటుండటంతో కాయ ఈగ, శనగపచ్చపురుగు సోకుతోంది. దీంతో కంది రైతు విలవిల లాడుతున్నాడు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో బావులు, బోర్ల కింద దాదాపు 8000 ఎకరాల్లో కంది పంటను సాగుచేశారు. చాలా మంది రైతులు వేరుశనగతో పాటు ఇతర పంటలో కూడా అంతర్‌పంటగా కూడా సాగు చేశారు. గోనెగండ్ల, కులుమాల, అలువాల, పెద్దమరివీడు, చిన్నమరివీడు, వేముగోడు, పుట్టపాశం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, తిప్పనూరు, హెచ్ కైరవాడి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కంది పంటను ఎక్కువగా సాగుచేశారు. అయితే ప్రస్తుతం సోకిన పురుగుకు ఎన్ని మందులు పిచికారి చేసినప్పటికి అదుపులోకి రావడంలేదు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. శనగపచ్చపురుగు, కాయ ఈగ, జీడపురుగు ఎక్కువగా ఉండటంతో పూత మొత్తం రాలిపోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని వాపోతున్నారు.


పూత పట్టిన కంది పంట

గతంలో ఈ తెగులు లేదు

రెండు ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. గతంలో ఇంత ఎక్కువ స్థాయిలో పురుగులేదు. ఇప్పుడు సోకిన పురుగు ఎన్ని మందులు పిచికారి చేసినా అదుపులోకి రావడం లేదు. దానికి తోడు పొగమంచు కమ్ముకోవడంతో వాతావరణం మొత్తం మారిపోయింది.

\- జయరాముడు, పిల్లిగుండ్ల



అధికారులు సలహాలు ఇవ్వాలి

పురుగు వల్ల పూత మొత్తం రాలిపోతోంది. ఎన్నిమందులు పిచికారి చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు పంటలను పరిశీలించి సలహాలు ఇవ్వాలి. ఏ మందు పిచికారి చేయాలి, ఎంత చేయాలనే విషయాన్ని వివరించాల్సిన అవసరం ఉంది.

\- మాబు, రైతు, గోనెగండ్ల

సకాలంలో పిచికారి చేస్తే పూత రాలిపోదు



రైతులు సకాలంలో పురుగును గుర్తించి మందులు పిచికారి చేయాలి. గోనెగండ్ల మండలంలో కంది పంటకు దోమ, శనగపచ్చ పురుగు సోకింది. క్లోరిపైరిపాస్ 2.5మి.లీ. పూత లేదా కాయదశలో క్వినాల్‌ఫాస్2.0మి.లీ. లేక ఎసిపేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ మందు వాడిని తరువాత కూడా శనగపచ్చ పురుగు నివారించలేకపోతే ఇండాక్సాకార్బ్ 1.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. ను ఇమామీయోక్టిన్ 0.4 గ్రా నీటిలో కలిపి పిచికారి చేయాలి. పురుగు తప్పక అదుపులోకి వస్తుంది.

\- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు